


ఠంగ్...ఠంగ్...ఠంగ్...

గోడ గడియారం పది గంటలు కొట్టింది. 'ప్రాక్టికల్ హిప్నాటిజం' చదువుతూ ఆలోచిస్తూన్న మీనా ఆ శబ్దానికి ఉలికిపడింది. క్షణంలో తెప్పరిల్లి పరిసరాల్ని గమనించింది. రాత్రి పది అయినా సుబ్బారావు ఇంకా రాలేదనుకొని మళ్ళీ చదవటంలోనూ, ఆలోచనలోనూ మునిగిపోయింది.

మీనాకి ఇరవై అయిదేళ్ళుంటాయి. అందంగా ఉంటుంది. మధ్యతరగతి బతుకు నచ్చక సుఖంకి, సంతోషానికి, ఆశలకీ వేసి పథకం ప్రకారం కంపెనీ సెక్రటరీ సుబ్బారావుని ట్రాప్‌చేసి పెళ్ళిచేసుకొంది.

సుబ్బారావుకి యాభై ఏళ్ళుంటాయి. మనిషి పొట్టిగా, లావుగా అసహ్యంగా ఉంటాడు. ఎవరూ అతనికి పిల్ల నివ్వజూపకపోవడంతో, బ్రహ్మచారిగా మిగిలిపోయాడు. కాకపోతే ఆస్తిపరుడు. పెద్ద ఉద్యోగస్తుడు. రెండంతస్తుల మేడ, చరాస్తులన్నీ కలుపుకొని పదిలక్షల ఆస్తిపరుడతను.

తగిన సంబంధం చూపినా కాదని, సుబ్బారావుని పెళ్ళిచేసుకొంటానని పట్టుబట్టడంతో, మీనా తల్లిదండ్రులు కూడ ఆమెకి అభ్యంతరం చెప్పలేదు.

వాళ్ళిద్దరికీ పెళ్ళయి సంవత్సరం గడిచింది. ఈ సంవత్సరం కాలంలో మిగిలిన సుఖం మాట ఎలావున్నా, సుబ్బారావుతో శారీరకసుఖం లేక విలవిల్లాడిపోతూంది మీనా. సుబ్బారావు ఎంతసేపూ కంపెనీ వ్యవహారాలు తప్ప, మిగిలిన వేటిలోనూ అంతగా ఆసక్తి చూపడు. అటువంటి సుబ్బారావు అనవసరమనిపించింది మీనాకి. అందుకే, మరొక బాయ్ ఫ్రెండును ఏర్పరచుకొని, అతని ప్రేమలో పడింది. సాధ్యమయినంత త్వరలో సుబ్బారావు నుండి విడివడి, ఆ బాయ్‌ఫ్రెండ్‌ను పెళ్ళిచేసుకోవాలనుకుంటూంది. బాయ్‌ఫ్రెండ్ అందగాడు కాని

ఆ స్త్రీపరుడు కాదు. ఆ స్త్రీ, అందం రెండూ కావాలి మీనాకి. రెంటిలో ఏ ఒక్కటి లేకున్నా జీవించలేదు. అందువల్ల సుబ్బారావుని చంపాలని నిర్ణయించుకొంది. సుబ్బారావు చనిపోతే అతని ఆస్తంతా మీనాకి మాత్రమే చెందుతుంది.

సుబ్బారావుని చంపడమన్నది హత్య కాకూడదు. ఆత్మహత్యగా లేదా ప్రమాదవశాత్తూ మరణించినట్టుగా నిర్ధారణ జరగాలి. అదే ప్రయత్నంలో మీనా ఒకసారి ఓడిపోయింది కూడ.

సుబ్బారావుకి కందిరీగలంటే చచ్చేంత భయం. చిన్నప్పట్నుంచీ ఆ ఈగ ఎక్కడ కనిపించి రొదచేసినా బెంబేలెత్తిపోతాడు. చావు ముంచుకొస్తున్నట్లుగా బిగిసిపోతాడు. అతడి భయాన్ని ఉపయోగించుకోజూసింది మీనా.

ఓరోజు అతని కారులో రెండు మూడు కందిరీగల్ని సంపాదించి పెట్టి, అవి బయటికి పారిపోకుండా జాగ్రత్త తీసుకొంది. కంపెనీకి వెళ్ళేందుకు ఆ కారునే ఉపయోగిస్తాడు సుబ్బారావు. అలికిడి లేనంతవరకు కందిరీగలు కూడ ఏమూలనో పడిఉంటాయి. అలికిడయితే విజృంభిస్తాయి. సుబ్బారావు కారునెక్కి డ్రైవ్ చేసుకొంటూ వెళుతుంటే, కుదుపులకి లేచి, తప్పకవి విజృంభిస్తాయి. అప్పుడు సుబ్బారావు చేష్టలుడిగిపోతాయ్. ఏక్సిడెంట్ జరుగుతుంది ముమ్మాటికీ. చని పోతాడనుకొంది. అయితే చిత్రంగా ఆ రోజు, ఆ కారులో సుబ్బారావు పోనే లేదు. సమయానికి ఎవరో ఫ్రెండ్ రావడంతో, అతని కారులోనే కంపెనీకి చేరుకొన్నాడు.

తర్వాత ఆ ప్లాన్‌ని మరి కొనసాగించలేదు మీనా. కారణం ఆ ప్లాన్ ప్రకారం సుబ్బారావు తప్పక చనిపోతాడన్న నమ్మకం ఆమెకి లేకపోవడమే; అందుకే మరో ప్లాన్‌ని ఆలోచిస్తుంది.

సుబ్బారావుకి చాలావాటిపై నమ్మకం తక్కువ; అందులో హిప్నాటిజం ఒకటి; అదంతా బోగస్ అంటాడతను.

పదకొండు గంటలు కొట్టింది గోడ గడియారం. అప్పటికి ఆలోచించాలో చించి స్థిరనిశ్చయానికి వచ్చింది మీనా.

రెండో అంతస్తులో వాళ్ళ బెడ్‌రూం ఉంది. ఆ రూమ్‌కి పడమటివైపు, పెద్దది, ఊచల్లేని కిటికీ వుంది. అక్కడి నుండి చూస్తే, క్రిందంతా రాళ్ళమయం; ఆ ప్రదేశంలో ఇల్లు కట్టుకోదలచి, ఆ స్థలంగలవాళ్ళు పునాదిరాళ్ళను కుప్పగా వేసి ఉంచారు. కిటికీ నుండి కిందికి దూకితే సరిగ్గా ఆ రాళ్ళమీద పడతాడు. చని పోవడం ఖాయం; లావుగా, బరువుగా ఉన్న సుబ్బారావులాంటివాళ్ళయితే మరీ

కాయం! ఆ ఆలోచనకి వికృతంగా నవ్వుకొంది మీనా.

సుబ్బారావు బలహీనతలపై ప్లేచేస్తాను. అతన్ని హిప్నటైజ్ చేస్తాను. కిటికీ నుంచి దూకేలా చేస్తాను. చంపేస్తాననుకొంది. అంతటి నిర్ణయానికి రావడంతో కొద్దిగా భయం చెందిందామె.

గోడగడియారం చప్పుడు గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నట్టుగా వుంది. దెయ్యం గోళ్ళతో ఎవరో శరీరాన్ని నిమురుతున్నట్టుగా జలదరిస్తుందామె. చెమటలు పట్టింది.

సుబ్బారావు దూకేసిన తర్వాత ఏం చేయాలి? ముందుగా ఊహించుకుందామె. అతనలా పడడంతో, ఆందోళనగా, గబగబా గ్రౌండుఫ్లోర్‌లోని డ్రాయింగ్ రూం చేరుకోవాలి! ఫోన్లో ఫామిలీ డాక్టరుకి చెప్పాలి! సుబ్బారావు ఆత్మహత్యకు పాల్పడ్డాడని. తర్వాత అతని మిత్రులకి చెప్పేటప్పుడు గొంతుమ బాధగా వణికించాలి. దుఃఖంతో నిండినట్టుండాలనుకొంది. ప్రాక్టికల్‌గా చేసి చూస్తాననుకొంది. డ్రాయింగ్ రూంలోనికి చేరుకొంది. రిసీవర్ని ఎత్తి, ఏ నంబరూ డయిల్ చేయకుండా —

"డాక్టర్! డాక్టర్! ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారు. కిటికీ నుంచి దూకేశారు. మీరు అర్జంటుగా రావాలి" అంది నటిస్తూ. ఆమె గొంతు ఆమెకే విషాదంగా విన్పించింది. 'దెన్ ఓకే' అనుకొని నిట్టూర్చింది.

అంతలో...

తలుపులు తెరుచుకొని వచ్చాడు సుబ్బారావు.

"సారీ మీనా! చాలా లేట్ చేశాను" అన్నాడు. పార్టీ నుంచి వచ్చాడేమో 'విస్కీ' వాసన గుప్పున వస్తూంది అతని నోటినుంచి.

ఏం మాట్లాడలేదామె. సమాధానంగా నవ్వేందంతే! మందుకొట్టి, సుబ్బారావు రావడంతో తన పథకాన్ని మరింత సులువుగా జరిపించవచ్చు ననిపించిందామెకి.

"నిద్రపోక ఏంచేస్తున్నావు?" అనడిగాడు.

"ప్రాక్టికల్ హిప్నాటిజం చదువుతున్నాను" కావాలనే చెప్పింది.

"బ్లడీ హిప్నాటిజం! ఐ హేటిట్" అన్నాడు సుబ్బారావు.

"వండర్‌ఫుల్ బుక్! చదివిన తర్వాత ఎవరినైనా హిప్నటైజ్ చేయగలననిపిస్తూంది నాకే" అంది.

"ఎవరినయినా కాదు, వీక్ మైండెడ్‌వాళ్ళనే చేయగలవు" అన్నాడతను.

"నథింగ్! ఎవర్నయినా చేయగలను. నిన్ను కూడ..." సుబ్బారావుని

ఉద్రేకపరుస్తూ రెట్టించిందామె.

"చేయలేవు. నేను చాలా స్ట్రాంగ్ మైండెడ్"

"ఏమీకాదు. నిన్ను హిప్నటైజ్ చేయగలను. 'ఎంత పందెం'" అతన్ని రెచ్చగొట్టింది.

"చేయి చూద్దాం" అన్నాడతను.

అంతే! మీనా ఒక్క క్షణం వణికిపోయింది. అంతలోనే ధైర్యం తెచ్చుకొని "ముందు నా కళ్ళలోనికి సూటిగా చూసి కళ్ళు మూసుకో" అంది సుబ్బారావుతో. అతనలానే చేశాడు.

"నీకు నిద్రొస్తూంది....నిద్రొస్తూంది...వస్తూంది" క్రమపద్ధతిలో అందామె.

సుబ్బారావు గుర్రుపెట్టి, నిల్చునే నిద్రపోతున్నాడు. మీనాకి ఆనందమనిపించింది. 'హేట్స్ ఆఫ్ టు ప్రాక్టికల్ హిప్నాటిజం' అనుకొంది. ఆలస్యం చేయలేదు.

"నిద్రలో నువ్వు నడవగలవు. మెట్లన్నీ ఎక్కి రెండో అంతస్తులోని మన బెడ్‌రూంకి రాగలవు" అంది. సుబ్బారావు మెల్లగా మెట్లెక్కాడు. బెడ్‌రూం లోనికి చేరుకున్నాడు. అతనితోపాటే నడుస్తూ విస్తుపోయిందామె. అతను ఈజీగా హిప్నటైజ్ చేయబడతాడు. అందుకే హిప్నాటిజాన్ని అసహ్యించుకొంటున్నా డనుకొంది.

"ఆ కిటికీ దగ్గరకి వెళ్ళి నిల్చో" అంది. సుబ్బారావు కిటికీ దగ్గరగా వెళ్ళి నిల్చున్నాడు. నేలకి ఆరుగు ఎత్తులో ఉంది కిటికీ.

"చల్లని గాలి వీస్తోంది. నీకు గాలిలో తేలిపోతున్నట్టుగా ఉంది. అవునా?" అడిగింది.

సుబ్బారావు ట్రాన్స్‌లో ఉండి, అవునన్నట్టుగా తలూపాడు. "నీకు కందిరీగ లంటే భయం! కాని నీ కిప్పుడు ఆ భయంలేదు. అదిగో కందిరీగ! కిటికీ నుండి పారిపోతోంది. నువ్వెళ్ళి దాన్ని పట్టుకొంటావు. పట్టుకొంటావు. పట్టుకొంటావు-" అంది.

సుబ్బారావు కిటికీని ఎక్కేశాడు. కాళ్ళతో బేలన్స్ చేసుకొంటూ నిల్చున్నాడు. దూకడం లేదతను. ఆమె గుండె వేగం హెచ్చింది. ఆందోళనగా ఉంది. దూకడెందుకు? అనిపించింది. వెనుకనుండి తోసేద్దామనుకొని అతనికి దగ్గరగా నడిచిందామె. కాని ఆ ప్రయత్నాన్ని విరమించుకొంది

"పారిపోతూంది కందిరీగ! నువ్వు పరుగెత్తగలవు. దాన్ని పట్టుకోగలవు.

పట్టుకో...పట్టుకో...పట్టుకో" గొంతు వేగాన్ని హెచ్చించి అరిచింది మీనా.

సుబ్బారావు దూకేశాడు కిటికీకి అటు కాదు. ఇటు: దూకి, మీనా నోటిని బలంగా మూసేసి, ఎత్తి. ఆమెను కిటికీ నుండి అవతలకి విసిరేశాడు. అంతా మెరుపువేగంలో జరిగింది.

ఆ నిశిరాత్రివేళ మీనా పెద్దగా అరుస్తూ క్రింద పడిపోతోంది. మొదటి అంతస్తులోని ఇనుప చువ్వొకటి ఆమె కంటికి గుచ్చుకొని, కన్ను ఊడొచ్చి గవ్వలా ఎగిరిపడింది. దానితోపాటే, మీనా కూడ బంగలు చుట్టుకొంటూ క్రిందపడి 'ఠాప్' మంది. రెణ్ణిమిషాలు కొట్టుకొని అచేతనురాలయింది. చనిపోయింది.

గుడ్డి వెలుగులో, కిటికీ నుండి చూస్తూ. ఆమె చనిపోయిందని నిర్ధారించుకొన్నాక, సుబ్బారావు డ్రస్ ఛేంజ్ చేసుకొని. గబగబా, ఆందోళనగా గ్రౌండ్ ఫ్లోర్‌లోని డ్రాయింగ్ రూం చేరుకొన్నాడు. రిసీవరెత్తి, ఫామిలీ డాక్టర్‌కి ఫోన్ చేశాడు.

"డాక్టర్. డాక్టర్! మా బెడ్‌రూం కిటికీ నుండి మీనా పడిపోయింది. అర్జంటుగా రావాలి" అన్నాడు. దుఃఖం, బాధ మిళితమయిన గొంతుతో.

"ఎలా పడింది?" అనడిగాడు డాక్టర్.

"సెల్ఫ్ హిప్నాటిజం ప్రాక్టీసుచేస్తూ...మీరు అర్జంటుగా రావాలి. నా భార్యను బ్రతికించాలి. మీనా లేక నేను బ్రతకలేను..." గొంతులో ఏడుపుని ధ్వనింపజేస్తూ అన్నాడు సుబ్బారావు. తర్వాత ఆ లైన్‌ను కట్‌చేసి. మీనా తల్లిదండ్రులకి కూడ అదే విధంగా ఫోన్ చేశాడు

కొన్ని క్షణాల తర్వాత, బయటికి నడిచి. మీనా శవం దగ్గరగా వచ్చి చూశాడు. అప్పటికే చుట్టుపక్కలవాళ్ళు పోగయి ఉన్నారక్కడ.

రక్తం మడుగులో మీనా భయంకరంగా ఉంది. ఓ కన్ను గుల్లగా ఉంది, మరీ భయం కలుగజేస్తూంది చూసేవాళ్ళకి. ఆ గుల్లలో కందిరీగొకటి రొదచేస్తూ ఆ గుల్లని మరింతగా గుల్లచేస్తూ లోనికి పోయేందుకు ప్రయత్నిస్తూంది!

'నా కిక కందిరీగలన్నా, నువ్వన్నా భయం లేదు మీనా! నేనిక హాయిగా జీవిస్తాను' అనుకొన్నాడు – సంవత్సరం నుండి మీనా ఎత్తుగడలన్నీ గమనిస్తూ వచ్చిన సుబ్బారావు.